క్లుప్తంగా

ఇళ్ల పట్టాలిచ్చి వసతులు కల్పించాలి

రంగంపేట: మండలంలోని సింగంపల్లి గ్రామం సీపీరెడ్డి నగర్ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు అందించి, మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీపీ రెడ్డి నగర్ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సింగంపల్లిలో 25 ఏళ్లుగా సీలింగ్ భూముల్లో నివాసముంటున్న సుమారు 250 కుటుంబాలకు తక్షణమే పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరు రాజబాబు, కె.సతీష్, అంజిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

సీతానగరం: మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న రఘుదేవపురం రవీంద్ర కాలనీకు చెందిన పిసిని కిషోర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై టి రామకృష్ణ సోమవారం తెలిపారు. కిషోర్ నుంచి 12 బాటిల్స్‌ను స్వాధీనం చేసికుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అమ్మవారికి కుంకుమ పూజ

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో పార్వతీ సమేత గౌరీశ్వర ఆలయం వద్ద అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సోమవారం పాల్గొన మాసం పౌర్ణమి సందర్భంగా సహస్ర సంఘం ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు, కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక తదితర గ్రామాల నుంచి 512 మంది ముత్తయిదువులు అమ్మవారి కలశం ఏర్పాటు చేసుకుని అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన జరిపారు.

ఘనంగా లక్ష పత్రి పూజ



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెదపూడి: పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట్రావు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

బిక్కవోలు: చిన్నారుల్లో ఏర్పడే జన్యు లోపాలను అధిగమించేందుకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని వైఎస్సార్ క్రాంతి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ టి.సుప్రియ అన్నారు. సోమవారం బిక్కవోలు శ్రీప్రజ్ఞ జూనియర్ కళాశాల వద్ద నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఫిట్‌గా ఉండేందుకు తగిన వ్యాయామం చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన పరుగు పందెంలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ యూత్ వలంటీర్ మణికంఠ రామకృష్ణ రెడ్డి, జూనియర్ కరస్పాండెంట్ ఓదూరి శ్రీను, ప్రిన్సిపాల్ ఎన్.గోవిందరాజు, ఏవీ కృష్ణారెడ్డి, యూత్ లీడర్ జి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ మోదీ ప్రభుత్వం రావాలని పూజలు

మధురపూడి: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడో సారి ప్రభుత్వం ఏర్పడాలని, రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుపాటి పురందేశ్వరి ఎంపీగా విజయం సాధించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏపీ ఆర్ చౌదరి ఆధ్వర్యంలో సోమవారం కోరుకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. తొలుత శివాలయంలో పూజలనంతరం, శ్రీలక్ష్మీనరసింహ స్వామి, సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు. నీరుకొండ వీరన్న చౌదరి, పచ్చారి నరసింహమూర్తి, తగరంపూడి గణపతి, మద్దిపాటి రజనీ, సీహెచ్ మోహినీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి తీర్థం



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవాలు ఐదురోజులపాటు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఫలాలు అలంకరణతో శ్రీపుష్పయాగం నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో హోలీ



రాజానగరంలో హోలీ వేడుకల్లో చిన్నారులు



పందలపాకలో హోలీ జరుపుకొంటున్న యువతులు, చిన్నారులు

అనపర్తి: రంగుల పండగ హోలీని సోమవారం గ్రామ గ్రామాన ప్రజలు ఆనందోత్సాహాల నడుమ వేడుకగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ, రంగులు పూసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. వసంత రుతువులో పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ హోలీ సంబరాల్లో సోమవారం ఉదయం నుంచి ముఖ్యంగా చిన్నారులు, యువత రంగులు కలిపిన నీళ్లను చల్లుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. దీంతో రహదారులన్నీ రంగుల మయంగా మారాయి.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో యువత, చిన్నారులు, విద్యార్థులు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా పెదపూడి, జి.మామిడాడ, రామేశ్వరం, కరకుదురు, కాండ్రేగుల, పెద్దాడ, తదితర గ్రామాల్లో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండగ చేసుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

బిక్కవోలు: వసంత పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం మండలంలోని చిన్నా పెద్ద తేడా లేకుండా ఆనందంతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి యువకులు బైక్‌ల మీద తిరుగుతూ రంగులు చల్లుకుని వసంత కాలానికి స్వాగతం పలికారు. పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు, ఊల్లపల్లి, బలభద్రపురం, బిక్కవోలు తదితర గ్రామాల్లో హోలీని ఆనంద రంగేళిగా జరుపుకున్నారు.



అనపర్తిలో రంగు నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు

ఎన్నికల్లో నిబంధనలను పాటించాలి

- ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 265 మంది బైండోవర్
- నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు



కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

మధురపూడి: మే 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు, అభ్యర్థులు నిబంధనలు పాటించాలని రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు కోరారు. కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తన పనిని మొదలు పెట్టిందన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, పోలింగ్‌కు ఆటంకం లేకుండా ఉండేందుకు 265 మందిని బైండోవర్ చేసిందన్నారు. వీరిని తహసీల్దార్ ముందు హాజరుపర్చి రూ.లక్ష పూచీకత్తును తీసుకుందన్నారు. ఎన్నికల సజావుగా జరగడానికి, వివిధ రక్షణావసరాల రీత్యా జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దులు గోకవరం, రాజానగరం మండలం తూర్పు గానుగూడెంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల సందర్భంగా వివిధ దాడులు నిర్వహించి 4 వేల లీటర్ల సారాను, బెల్టుషాపులపై దాడి చేసి 477 మద్యం సీసాలను, 109 గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వివాదాస్పదమైన వ్యక్తులు, పాత కేసుల్లోని 91 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం కోసం సువిదాలో అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సింగిల్ విండో సిస్టమ్ ప్రకారం నియోజకవర్గం స్థాయిలో ఆర్‌వో నుంచి, జిల్లా స్థాయిలో కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. 19 రకాల అనుమతులు (అప్లికే షన్లు) ఉన్నాయని, దీనిలో వాహన, ర్యాలీలు, మైక్, వీధి మీటింగ్‌లు, స్టేజీ ఏర్పాటు చేయడం, ఇంటింటి ప్రచారం, ర్యాలీకి అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు తీసుకోని వారిపై కేసులు నమోద చేస్తామన్నారు. సువిదాలో అప్‌లెచైసి, అనుమతులు తీసుకోవాలని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, రాజానగరం సిఐ కాశీ విశ్వనాథ్, కోరుకొండ ఎస్సై డి.ఆనందకుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



పాలమూరులోని ఓ రైస్ మిల్లు కార్మికులను కలిసి మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం మండలంలోని పాలమూరులో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఆయా పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నిరుపేదల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన జగనన్నకు రాబోయే రోజుల్లో అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, పాలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కట్టుదిట్టం

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- అనపర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి

అనపర్తి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు తదితర ముఖ్యాంశాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి వివరించారు. ఎన్నికల నియమావళిపై ఆమె వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే...

క్షేత్ర స్థాయిలో 9 ప్రత్యేక బృందాలు

ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 9 ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో తిరుగుతూ విధులు నిర్వహిస్తున్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. దీంట్లో భాగంగా ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, ఎన్నికల ఖర్చు లెక్కించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి

21 మంది సెక్టోరల్ అధికారులు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల 228 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎన్నికల సమయంలో సమస్యాత్మక గ్రామాల్లో 24 గంటలు ముందుగానే పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గ పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పన, శాంతి భద్రతల పర్యవేక్షణలో సెక్టోరియల్ అధికారుల విధుల కీలకం. దీనికి అనుగుణంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 21 మంది సెక్టోరల్ అధికారులను నియమించాం.

కోడ్ నియమావళి

అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 2,23,255 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 1,09,323 మంది, మహిళా ఓటర్లు 1,13,930 మంది, థర్డ్ జెండర్ ఇద్దరు ఓటర్లు ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కుల, మత, వర్గ విభేదాలు పెంపొందించేలా, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలను పాల్పడరాదు. కుల, మతాల పేరుతో ఓట్లు అడగడానికి వీల్లేదు. వీటికి సంబంధించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదు. ఓటర్లను ప్రలోభాలు, బెదిరింపులకు గురి చేయకూడదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

సువిధ యాప్

ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు వివిధ అనుమతుల కోసం సువిధ యాప్‌ను వినియోగించుకోవచ్చు. ఎన్నికల్లో జరిగే అవకతవకలు, నియమావళి ఉల్లంఘన, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అంశాలు, ఓటర్ల బెదిరింపులకు గురిచేస్తున్న సందర్భాల్లో నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు గాను సీ–విజిల్ (సిటిజన్ విజిలెంట్) యాప్‌ను ప్రవేశపెట్టాం. గడువులోగా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. రాజకీయ పార్టీల నేతలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు గాను ముందస్తు అనుమతులు తప్పనిసరి.

మళ్లీ జగన్‌కే పట్టం కడదాం



దోసకాయలపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించిన జక్కంపూడి విజయలక్ష్మి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- దోసకాయలపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశం

మధురపూడి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కడదామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం కోరుకొండ మండలం దోసకాయలపల్లి జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు నివాస గృహంలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ అత్యధిక మెజార్టీ సాధనకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సంగతిని, అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలందిస్తున్న సంగతులను ఓటర్లకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ నాయకులు కడియాల పాపారావు, కడవల శివ, నీరుకొండ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే జీతాల పెంపు

రాజమహేంద్రవరం సిటీ: రెండేళ్ల నిరంతరాయ పోరాటం చేయడం ద్వారా 17 శాతం జీతాలు పెంపు సాధించుకున్నామని ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోషియేషన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ కిషోర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సూర్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం హోటల్ రివర్‌బే ఆహ్వానం పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 5 జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఆఫీసర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ ఆఫీసర్ల జీతాల పెంపు కోసం 2022 నవంబర్ నుంచి ప్రారంభించిన పోరాటంతో సాధించుకున్నామని, 9 జాయింట్ నోట్ సెటిల్‌మెంట్ కావడంతో 17 శాతం పెంపు సాధించుకున్నామన్నారు. పెరిగిన జీతాలు 2024 మార్చి 25న ఆఫీషర్ల ఖాతాల్లో జమ కావడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఐదు రోజుల పనిదినాలు అమలులోనికి రానున్నాయన్నారు. దీని కోసం సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు విశ్వనాథ్, మంగిన శ్రీనివాసరావు, ఎసీఎస్ శ్రీధర్, గాలి శ్రీనివాసరావు, శేషుకుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉమా భాస్కరస్వామి వార్షిక తీర్థ మహోత్సవం, సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ వివాదంగా మారింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం తీర్థం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా వద్ద పాటల విషయంలో రెండు సామాజికవర్గాల వ్యక్తుల మధ్య వివాదం తలెత్తింది. అనంతరం అది కాస్తా కొట్లాటకు దారి తీయడంతో పోలీసులు లాఠీ చార్జి చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. అనంతరం తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆశ్రమంలో అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటి గ్రామంలో మానవీయ ఐక్యసేవా సంఘం వృద్ధులు, అనాథులు, మానసిక వికలాంగుల ఆశ్రమంలో సోమవారం సత్యచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ట్రస్టు సభ్యులు కసిరెడ్డిదుర్గాప్రసాద్, వెంకటనాగమణి దంపతుల వివాహవార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు, అనాథులకు, దివ్యాంగులకు మధ్యాహ్నం, రాత్రి ట్రస్ట్ తరుపున అన్నదానం చేశారు. అలాగే పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి దుర్గాప్రసాద్, వెంకట నాగమణి దంపతులు, కుటుంబ సభ్యులు, సత్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు టి.సత్యనారాయణ, టి.రవి, శ్రీరామ్మూర్తి, భరద్వాజ, పి.సాయిదుర్గ, ఆశ్రమం నిర్వాహకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో స్వర్ణయుగం




కోటపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- కోటపాడులో ఎన్నికల ప్రచారం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం స్వర్ణయుగం దిశగా సాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, రాజు దంపతులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పిస్తుందన్నారు. రాజకీయాల్లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలను ఇంటికే చేర్చారన్నారు. ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేలా జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు మహిళలకు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. అందుకే మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటేసి, వైఎస్ జగన్‌మోహరెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఆదిలక్ష్మి ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుంకర అప్పారావు, గవరసాని రాజు, వీరబాబు, గుగ్గీల వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మనోహరం



గోదారమ్మపై నిర్మించిన రెండు వంతెన మధ్య నుంచి అస్తమిస్తున్న సూర్యుడు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాడు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద సోమవారం సాయంత్రం ఈ మనోహర దృశ్యం కనిపించింది. పుష్కరాలరేవుకు వచ్చిన సందర్శకులు, ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు.

– గరగ ప్రసాద్, రాజమహేందవరం

యువతతోనే సమాజాభివృద్ధి

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్
- టీడీపీ, జనసేన పార్టీల నుంచి 300 మంది వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన యువతతో ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: యువశక్తిని నిర్వీర్యం చేసే రాజకీయ నాయకుల తాట తీయాల్సిన సమయం ఆసన్నమైందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు సుమారు 300 మంది ఉల్లూరి రాజు ఆధ్వర్యంలో ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువశక్తితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగలన్నా జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. యువత ప్రజలను చైతన్యపరిచే బృహత్తర కార్యక్రమంలో కీలక పాత్ర పోషించాలని ఎంపీ భరత్ రామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.